క్లుప్తంగా

కమిటీ ఎన్నిక



మహాముత్తారం: మండలంలోని లింగాపూర్ గ్రామంలో ఆదివారం ఎమ్మార్పీఎస్ మండల నాయకులు గ్రామ కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. నూతన గ్రామ కమిటీ అధ్యక్షుడిగా వావిల్ల రాజయ్యమాదిగ, ఉపాధ్యక్షుడిగా కొలుగురి రాజయ్య, ప్రధాన కార్యదర్శిగా తాళ్లపల్లి దుర్గయ్య, కార్యదర్శిగా రాకేష్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు మండల ఇన్‌చార్జ్ అశోక్ మాదిగ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ నాయకులు మారుపాక లచ్చయ్య, పుల్యాల రాజు పాల్గొన్నారు.

ఆర్థిక సాయం



టేకుమట్ల(రేగొండ): రేగొండ మండలంలోని భీంనగర్‌తండాకు చెందిన బానోత్ యాకూబ్ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. దీంతో బాధిత కుటుంబ సభ్యులను మృతుడి చిన్ననాటి మిత్రులు ఆదివారం పరామర్శించి, రూ.13,500 ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో అనుష, మల్లిక్, హైమావతి, సమత, మాదవి, తదితరులు ఉన్నారు.

రైతులు గోస పడుతుంటే దశాబ్ది ఉత్సవాలా..?

వెంకటాపురం(ఎం): అకాల వర్షాలతో పంటలు నష్టపోయి, మిగిలిన పంటను విక్రయించినా డబ్బులు రాక రైతన్నలు గోస పడుతుంటే రాష్ట్ర ప్రభుత్వం దశాబ్ది ఉత్సవాలను నిర్వహించడం సిగ్గుచేటని బీజేపీ మండల అధ్యక్షుడు భూక్యా జవహర్‌లాల్ అన్నారు. ఆదివారం మండలంలోని పాలంపేటలో ఆయన బీజేపీ నాయకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ధాన్యం డబ్బులను 72 గంటల్లోనే రైతుల ఖాతాల్లో జమచేస్తామని చెప్పిన ప్రభుత్వం నెల రోజులు గడిచినా చెల్లించకపోవడంతో రైతులు ఇబ్బందులకు గురవుతున్నారని పేర్కొన్నారు. వానాకాలం పంట పెట్టుబడి కోసం రైతులు అప్పులు చేయాల్సిన దుస్థితి నెలకొందన్నారు. రైతు వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్న బీఆర్‌ఎస్ ప్రభుత్వానికి రాబోయే ఎన్నికల్లో రైతులు, ప్రజలు తగిన గుణపాఠం చెప్తారని హెచ్చరించారు. కార్యక్రమంలో బీజేపీ నియోజకవర్గ కన్వీనర్ సిరికొండ బలరాం, జిల్లా కార్యదర్శి శ్రీమంతుల రవీంద్రాచారి, నాయకులు కొత్త వీరస్వామి, పత్తి నాగేశ్వర్‌రావు, రాజేందర్, మోత్కూరు భిక్షపతి, అనిల్, శ్రీధర్‌లు పాల్గొన్నారు.

ఫ్రీజర్ బహూకరణ



ములుగురూరల్: ములుగు, భూపాలపల్లి జిల్లాల సబ్ రిజిస్ట్రార్ తస్లీమా మహ్మద్ తన స్వగ్రామం రామచంద్రాపురం గ్రామస్తుల కోరిక మేరకు తన తండ్రి జ్ఞాపకార్థంగా ఫాథర్స్ డే సందర్భంగా సర్వర్ చారిటబుల్ ట్రస్ట్, ఫౌండేషన్ ఆధ్వర్యంలో బాడీ ఫ్రీజర్ బాక్సును ఆదివారం బహూకరించారు. గతంలో గ్రామానికి స్వర్గ రథాన్ని బహుకరించిన తస్లీమా ప్రస్తుతం ఫ్రీజర్ అందించడంపై గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. పుట్టిన ఊరికోసం సేవచేయడం అదృష్టమన్నారు. ప్రాంతానికి ఎంత చేసినా తక్కువేనని, గ్రామ రుణం తీర్చుకోలేనిదని తస్లీమా అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ హట్కర్ కల్పన, రూప్‌సింగ్ ఉన్నారు.

కొండెక్కిన ధరలు

- కిలో చికెన్@320
- ఆకాశాన్నంటిన కూరగాయల రేట్లు
- ఆందోళన చెందుతున్న ప్రజలు

కాళేశ్వరం: కూరగాయలు, చికెన్ ధరలు ఆకాశాన్నంటాయి. సామాన్యుడు ఏమీ కొనేటట్టు లేదు.. ఏమీ తినేటట్టు లేదు. మార్కెట్‌కు వెళితే జేబుకు చిల్లు పడక తప్పడం లేదు. జూన్ మాసం సగానికి వచ్చిన వర్షాలు లేక ఎండ తీవ్రతతో కూరగాయల ధరలు మిన్నంటిపోయాయి. మార్కెట్‌లో ధరలు భగ భగ మంటున్నాయి. సామాన్యుడు కూరగాయలు, కోడి కూర తినే పరిస్థితులు లేవు. ఇప్పటికే ఎండల తీవ్రతతో పాటు వడగాలులు వీస్తున్నాయి. జిల్లావ్యాప్తంగా 44–45 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదు అవుతోంది. వర్షాలు పడక కూరగాయల ధరలు పెరిగాయి. ఇతర ప్రాంతాల నుంచి కూరగాయలు వ్యాపారులు దిగుమతి చేయడం, స్థానికంగా కూరగాయలు పంటలు ఎండల తీవ్రతకు తట్టుకోలేకపోవడంతో వ్యాపారులు ధరలు పెంచి విక్రయిస్తున్నారు. దీంతో సామాన్య జనం ఆందోళన చెందుతున్నారు.

కూరగాయల ధరలు కిలోల్లో ..

పచ్చిమిర్చి	140	మునిగకాయ	80
టమాట	60	కాకర కాయ	60
బీరకాయ	100	చిక్కుడుకాయ	120
వంకాయ	50	గోరుచిక్కుడు	80
దొండకాయ	80	అలసంద	60
సొరకాయ	30	క్యాబేజీ	60
కొత్తిమీర	150	క్యారెట్	80
బెండకాయ	60	తోటకూర	80

కొండెక్కిన కోడి..

కూరగాయల ధరలు పెరగడంతో చికెన్‌తోనైనా తిందామనే సామాన్యుడికి కోడి ధరలు కొండెక్కాయి. నెల కిందటి వరకు కిలో రూ.220 ఉన్న చికెన్ ధరలు, ఒక్కసారిగా పెరిగి చికెన్ స్కిన్‌లెస్ ధర రూ.320 చేరింది. ఫారాల్లో ఎండ తీవ్రతకు కోళ్లు మృత్యువాత పడడంతో ధరలు అమాంతం పెరిగాయి.



వామ్మో ఇవేం ధరలు



కూరగాయల ధరలు బాగా పెరిగాయి. జూన్ నెల సగం పూర్తయిన వర్షాలు లేక కూరగాయలపైన ప్రభావం పడింది. మార్కెట్‌లో ధరలు పెరగడంతో ఏమి కొనె పరిస్థితులు లేవు. ఏది కొన్న ధరలు మండి పోతున్నాయి.

–కావేరి శ్రీమతి, కాళేశ్వరం

చికెన్ ధర పెరిగింది



కూరగాయలు , చికెన్ ధరలు పెరిగాయి. రూ.200తో మార్కెట్‌కు వస్తే రెండు రకాలు కూరగాయలు కూడా వస్తలేవు. కిలో చికెన్ రూ.320కి పెరిగింది. ఎండలు దంచికొడుతుండడంతో ధరలు పెరిగాయి.

–తాజ్‌బాబా, కాళేశ్వరం

పురాతన కళలను కాపాడుకోవాలి



సాధన సూరులను సన్మానిస్తున్న సంఘంనాయకులు

భూపాలపల్లి రూరల్: పురాతనమైన కళలను కాపాడుకోవాలని, కళాకారులను ఆదరించాలని పద్మశాలి కుల పెద్దలు తుల శ్రీనివాస్, చిరురాల మల్లయ్య అన్నారు. ఆదివారం భూపాలపల్లి మున్సిపల్ పరిధిలోని జంగేడు గ్రామంలో సాధన సూరులు కళా ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా కుల పెద్దలు శ్రీనివాస్ మాట్లాడుతూ.. ప్రతి నాలుగు సంవత్సరాలకు ఒకసారి నిర్వహించే పద్మశాలి ఉప కులమైన సాధనసూరుల వారి ప్రదర్శనను ఈ తరంతో పాటు రాబోయే తరానికి గుర్తుండేలా గంజి శంకరయ్య గంజి పరందామయ్యల కళాబృందం కళలను ప్రదర్శించారన్నారు. పద్మశాలీల ఐక్యతను పటిష్ఠ పరిచేందుకు పూరాతన ఆచారాలను కట్టుబాట్లను గుర్తుచేసేందుకు సాధన సూరుల కృషి చేయడం అభినందనీయమన్నారు. మార్కండేయ పరపతి సంఘం ఆధ్వర్యంలో సాధన సూరులను సన్మానించారు. ఈ ప్రదర్శనలో కుల సంఘం నాయకులు కందకట్ల రాజు, కుమారస్వామి, మార్కండేయ, నర్సింగరావు, మల్లయ్య, రాయమల్లు, సామల శ్రీనివాస్ పాల్గొన్నారు.

పశువులకు టీకా వేయించాలి

భూపాలపల్లి రూరల్: పశువులు, ఆవులు, గేదెలకు గొంతు వ్యాధి రాకుండా ముందస్తుగా టీకాలు వేయించాలని భూపాలపల్లి మండల పశు వైద్యాధికారి తిరుపతి రైతులను కోరారు. ఆదివారం మండలంలోని గుడాడ్‌పల్లి గ్రామంలో గేదెలకు టీకాలు వేశారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ ఉడుత లక్ష్మి ఐలయ్య, గ్రామస్తులు, పశువుల యాజమానులు పాల్గొన్నారు.

సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయం



సీసీ కెమెరాలను ప్రారంభిస్తున్న సీఐ రాంనర్సింహారెడ్డి

భూపాలపల్లి అర్బన్: సీసీ కెమెరాల ఏర్పాటు అభినందనీయమని సీఐ రాంనర్సింహారెడ్డి అన్నారు. పట్టణంలోని ఎల్‌బీనగర్ మూడో లైన్‌లో సీసీ కెమెరాలు ఏర్పాటు చేయగా వాటిని ఆదివారం సీఐ ప్రారంభించి మాట్లాడారు. గతంలో సీసీ కెమెరాల ఏర్పాటుపై కాలనీ ప్రజలకు అవగహన కార్యక్రమం నిర్వహించినట్లు తెలిపారు. దీంతో కాలనీ వాసులు ముందుకు వచ్చి స్వచ్ఛందంగా ఆరు సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకున్నట్లు తెలిపారు. సీసీ కెమెరాల ద్వారా నేరాలు నిరోధించవచ్చన్నారు. పట్టణంలోని అన్ని కాలనీల ప్రజలు ముందుకు వచ్చి ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎస్సై స్వప్నకుమారి, సిబ్బంది, కాలనీవాసులు పాల్గొన్నారు.

అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు

కాటారం: పత్తి విత్తనాల డీలర్లు అధిక ధరలకు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని మండల వ్యవసాయాధికారి గిరి రామకృష్ణ హెచ్చరించారు. మండల కేంద్రంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాలను ఆదివారం ఏఓ తనిఖీ చేశారు. డీలర్లు రైతుల అవసరాలను బట్టి డీలర్లు ఉద్దేశ పూర్వకంగా పేరుపొందిన కంపెనీ విత్తనాలను బ్లాక్ చేసి అధిక ధరలకు విక్రయిస్తే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని తెలిపారు. డీలర్లు పత్తి విత్తనాలకు అధిక ధర డిమాండ్ చేసిన, అధిక ధరకు విక్రయించినట్లు తమ దృష్టికి వస్తే ఊరుకునేది లేదన్నారు. డీలర్లు రైతులకు ఖచ్చితంగా విత్తన కొనుగోలు రసీదు ఇవ్వాలని సూచించారు.



తనిఖీ చేస్తున్న ఏఓ రామకృష్ణ

కాంగ్రెస్‌తోనే అభివృద్ధి సాధ్యం

కన్నాయిగూడెం: కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే అభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే సీతక్క అన్నారు. ఆదివారం మండలంలో సీతక్క పర్యటించిన సందర్భంగా పార్టీ మండల అధ్యక్షుడు అప్సర్‌పాషా, మండల ఇన్‌చార్జ్ జాడి రాంబాబు ఆధ్వర్యంలో వివిధ పార్టీలకు చెందిన సుమారు 100 మంది కార్యకర్తలు కాంగ్రెస్లో చేరారు. వారికి సీతక్క పార్టీ కండువా కప్పి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. తెలంగాణ ప్రజలకు 10 సంవత్సరాల్లో ఏమి చేశారని దశాబ్ది ఉత్సవాలు జరుపుకుంటున్నారన్నారు. ప్రజలు నిత్యం సమస్యలతో అల్లాడుతున్నారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పథకాలు పేపర్లకు తప్ప ఆచరణలో లేవని ఎద్దేవా చేశారు. పార్టీలో చేరిన వారిలో వార్డు సభ్యులు చేరుకూరు సత్యం, మడప ముత్తయ్య, తిరుపతమ్మ తోపాటు బీఆర్‌ఎస్ నాయకులు సాయిని సాంబశివరావు, మల్లేష్, రాజేందర్, భాస్కర్, నాగమల్లయ్య, పుట్ట నవీన్, వెంకటేష్, సల్మాన్ తదితరులు ఉన్నారు.



పార్టీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సీతక్క

ఘనంగా మంచినీళ్ల పండుగ



మల్హర్: మహిళకు జ్ఞాపికను అందిస్తున్న ప్రజాప్రతినిధులు, అధికారులు



వెలిశాలలో వాటర్ ట్యాంక్‌ల వద్ద మహిళలు



మహాముత్తారం: ములుగుపల్లిలో..

మల్హర్: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండలంలోని 15 గ్రామ పంచాయతీల్లో మంచి నీళ్ల (మిషన్ భగీరథ) దినోత్సవ సంబురాలు ఆదివారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో ప్రధాన కూడలల్లో మిషన్ భగరీథ నీటిపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఓహెచ్‌ఆర్ ట్యాంక్‌ల వద్ద ముగ్గులు వేశారు. తాగు నీటికి కృషి చేసిన వారికి శాలువాలతో సత్కరించి, జ్ఞాపికలను బహూకరించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్‌లు, వివిధ శాఖల అధికారులు, ప్రజాప్రతినిధులు, సిబ్బంది పాల్గొన్నారు.

మహాముత్తారం: తెలంగాణ దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మహాముత్తారం మండలంలోని వివిధ గ్రామ పంచాయతీల్లో ఆయా గ్రామాల సర్పంచ్‌ల ఆధ్వర్యంలో ఆదివారం వాటర్ ట్యాంక్‌ల వద్ద ముగ్గులతో అలంకరించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం పలువురిని శాలువాలతో సన్మానించారు. మండల ప్రత్యేకాధికారులతో పాటు సర్పంచ్‌లు, మిషన్‌భగీరథ అధికారులు ఉన్నారు.



మొగుళ్లపల్లి: మంచి నీళ్ల ఉత్సవంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు

టేకుమట్ల/రేగొండ/మొగుళ్లపల్లి: దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా ఆదివారం మంచినీళ్ల పండుగను స్థానిక అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్వహించారు. ఈ సందర్భంగా ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక సర్పంచ్‌లు మాట్లాడుతూ.. ప్రజలు తాగు నీటి కోసం ఇబ్బంది పడకుండా సీఎం కేసీఆర్ మిషన్ భగీరథ పథకాన్ని ప్రవేశ పెట్టాడని అన్నారు. రక్షిత మంచినీటి పథకంతో ఎంతో మంది ప్రజలు ఫ్లోరైడ్ నుంచి విముక్తులయ్యారని ఆనందం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో టేకుమట్ల, రేగొండ, మొగుళ్లపల్లి మండలాల అధికారులు, ప్రజాప్రతినిధులు మహిళలు పాల్గొన్నారు.



మహాముత్తారం: ట్యాంక్ వద్ద వేసిన ముగ్గులు



మల్హర్: కొయ్యూరులో..



మొగుళ్లపల్లి: కొర్కిశాలలో..

'వ్యక్తిగత కక్షలతో తొలగింపు'

టేకుమట్ల(రేగొండ): తనపై వ్యక్తిగత కక్షలతో గ్రామ పంచాయతీ విధుల నుంచి తొలగిస్తున్నారని రేగొండ మండలంలోని దుంపిల్లపల్లి ఎంపీడబ్ల్యూ లింగస్వామి ఆరోపించారు. ఆదివారం ఆయన గ్రామంలో మాట్లాడుతూ.. 25 సంవత్సరాలుగా గ్రామ పంచాయతీలో పని చేస్తున్నానని స్థానిక సర్పంచ్ విజయ్‌కుమార్ తనపై కక్షతోనే విధుల నుంచి తొలగించే ప్రయత్నం చేస్తూ పల్లె ప్రగతి కార్యక్రమంలో పనులను చేయకుండా అడ్డుపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సర్పంచ్ తీరుపై పలుమార్లు అధికారులకు సైతం విన్నవించుకున్నానని తెలిపారు. చాలీ చాలని వేతనాలతో 25 సంవత్సరాలుగా పని చేస్తున్నానని, రాష్ట్ర ప్రభుత్వం జీపీ కార్మికులకు వేతనాలు పెంచడంతో ఆర్థికంగా ఆసరాగా ఉంటుందని భావించానని, కానీ సర్పంచ్ వల్ల సంవత్సర కాలంగా వేతనాన్ని కూడా తీసుకోలేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి జీపీ కార్మికుడిగా తనను కొనసాగించాలని కోరారు. ఈ విషయంపై ఎంపీఓను వివరణ కోరగా గ్రామ పంచాయతీలో రికార్డులను పరిశీలించి, సమస్యకు కారణాలను తెలుసుకుంటానని అన్నారు.

క్విజ్ పోటీలను విజయవంతం చేయాలి

మహాముత్తారం: హైదరాబాద్ యూత్ డిక్లరేషన్ స్ఫూర్తిగా నిర్వహించే రాజీవ్‌గాంధీ యూత్ ఆన్‌లైన్ క్విజ్ పోటీలను విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ మంథని నియోజకవర్గ ప్రచార కమిటీ చైర్మన్ కారెంగల తిరుపతిగౌడ్ యువతకు సూచించారు. ఆదివారం మండల కేంద్రంలో యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షుడు వంశిరాజ్ ఆధ్వర్యంలో సన్నాహక సమావేశం నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా ఆయన హాజరై ఆయన మాట్లాడారు. క్విజ్‌పోటీల్లో యువత అధిక సంఖ్యలో పాల్గొనే విధంగా చూడలని మండల నాయకులకు సూచించారు. ఈ కార్యక్రమంలో నాయకులు లింగమల్ల దుర్గయ్య, కోఆప్షన్ సభ్యుడు నజీర్‌ఖాన్, యూత్ కాంగ్రెస్ మండల ప్రధానకార్యదర్శి పక్కల రాజబాపు, ఉపాధ్యక్షుడు రూబిన్‌నాయక్, మహాముత్తారం ఉపసర్పంచ్ మధూకర్, యూత్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో పాల్గొన్న నాయకులు

గుడుంబా స్థావరాలపై పోలీసుల దాడులు

వెంకటాపురం(కె): మండల పరిధిలోని విజయపూరి కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలోని గుడుంబా స్థావరాలపై వెంకటాపురం పోలీసులు ఆదివారం దాడులు నిర్వహించారు. వెంకటాపురం ఎస్సై తిరుపతి రావు తెలిపిన వివరాల ప్రకారం.. విజయపూరి కాలనీ సమీపంలోని అటవీ ప్రాంతంలో జోరుగా గుడుంబా విక్రయాలు, తయారీ జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు సిబ్బందితో కలిసి దాడులు నిర్వహించినట్లు తెలిపారు. ఈ దాడుల్లో సుమారు మూడు వేల లీటర్ల బెల్లం పానకం ధ్వంసం చేయటంతోపాటు 25 లీటర్ల నాటు సారాను స్వాధీనం చేసుకుని ఇద్దరిని అదుపులోకి తీసుకున్నట్లు తెలిపారు. స్వాధీనం చేసుకున్న నాటుసారాతోపాటు, ఇద్దరు వ్యక్తులను ఎక్సైజ్ అధికారులకు అప్పగించినట్లు ఎస్సై తిరుపతి రావు తెలిపారు.

చోరీకి విఫలయత్నం

ములుగు: జిల్లా కేంద్రంలోని డీఎల్‌ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో తాళం వేసిన ఇంట్లో శనివారం రాత్రి కొంతమంది గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి విఫలప్రయత్నం చేశారు. అదే సమయంలో ఇంటి యజమాని రావడంతో తప్పించుకున్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లక్ష్మీనగర్‌లో నివాసం ఉంటున్న పినగాని శ్యాంబాబు కుటుంబ సభ్యులతో కలిసి హనుమకొండకు వెళ్లారు. ఇది పసిగట్టిన దొంగలు గునపంతో తాళం పగులకొట్టి ఇంట్లోకి ప్రవేశించారు. శనివారం రాత్రి తొమ్మిది గంటల 30 నిమిషాల సమయంలో ఇంటికి చేరుకున్న శ్యాంబాబు దంపతులు ఇంట్లో లైట్లు వెలిగి ఉండడాన్ని గమనించి గట్టిగా కేకలు వేశారు. చుట్టు పక్కల ప్రజలు రావడాన్ని చూసి దొంగలు గోడదూకి పారిపోయారు. శ్యాంబాబు 100 నంబర్‌కు డయల్ చేయడంతో పోలీసులు ఘటనాస్థలానికి చేరుకొని వివరాలు సేకరించారు. సెల్‌ఫోన్, రూ.20వేలు విలువ చేసే స్మార్ట్‌వాచ్, దుస్తులు దొంగలు అపహరించారని శ్యాంబాబు ఆదివారం ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. కేసును దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై పవన్‌కుమార్ తెలిపారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి



చిట్యాల: బావి నీరు కావాలని గొడవకు దిగిన మహిళలు



భూపాలపల్లి రూరల్: పెద్దాపూర్‌లో నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

చిట్యాల: మిషన్ భగీరథ ద్వారా వచ్చే నీరు సరిపోవడం లేదు.. గతంలో లాగా బావి నీరు వచ్చేలా చూడాలని మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామస్తులు ఆదివారం అధికారులు, ప్రజాప్రతినిధులపై ఆగ్రహం వ్యక్తంచేశారు. తెలంగాణ రాష్ట్ర దశాబ్ది ఉత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలోని వెంకట్రావుపల్లి (సీ) గ్రామంలో మిషన్ భగీరథ శాఖ ఆధ్వర్యంలో మంచినీళ్ల పండుగ కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎంపీపీ దావు వినోద వీరారెడ్డి, జెడ్పీటీసీ గొర్రె సాగర్ హాజరయ్యారు. సమావేశంలో మాట్లాడుతుండగానే అక్కడి మహిళలు ఒక్కసారిగా గొడవకు దిగారు. మిషన్ భగీరథ ద్వారా ఇచ్చే నీరు సరిపోవడం లేదు.. గతంలో లాగా బావి నీరే కావాలని వేడుకున్నారు. ఫిల్టర్ క్యాన్ వాటర్ తాగడంతో మోకాళ్ల నొప్పులు వస్తున్నాయని తెలిపారు. మిషన్ భగీరథ నీరు ఎక్కువగా వచ్చే విధంగా కృషి చేస్తామని ప్రజా ప్రతినిధులు చెప్పడంతో గొడవ సద్దుమనిగింది. ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అనిల్ కుమార్, సర్పంచ్ పూర్ణచందర్ రావు, ఎంపీటీసీ కట్కూరి పద్మ, పంచాయతీ కార్యదర్శి రవికుమార్ ఉన్నారు.

పెద్దాపూర్ గ్రామస్తుల నిరసన

భూపాలపల్లి రూరల్: గ్రామంలో నెలకొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆదివారం నీటి పండగ కార్యక్రమంలో పెద్దాపూర్ గ్రామస్తులు వాటర్ ట్యాంకు వద్ద నిరసన తెలిపారు. గ్రామస్తులు మాట్లాడుతూ.. గ్రామంలో మిషన్ భగీరథ నీరు ఒక బిందె కన్నా ఎక్కువ రావడం లేదన్నారు. వచ్చిన నీళ్లు కూడా చెత్తాచెదారంతో వస్తున్నాయని ఆవేదన వ్యక్తంచేశారు. నిరసనలో మాజీ సర్పంచ్ గూడూరి అరుణ భిక్షపతి, గ్రామస్తులు ఆకుల రాధ, చెప్యాల భాగ్యమ్మ, రజిత, వడ్లకొండ స్వర్ణ, మూల శోభ, చెరుకు కుమార్, ఎండీ సుకుర్, గట్టు మహేందర్, మామిళ్ల రాజు, మడ్డి కిషోర్, కత్తి తిరుపతి, ముక్కెర రాజు, ఈర్ల చిరంజీవి, రాజు, చక్రధర్ పాల్గొన్నారు.